# మానసికం

- శ్రీ సాయిపల్లవి.

"నువ్వేమైనా వీరేశలింగం అనుకుంటున్నావా? రాజారామ్మోహన్‌రాయ్ అనుకుంటున్నావా? నోర్మూసుకుని పరీక్షలకి చదువు. అడ్డమైన వాదనలు మొదలుపెడితే పళ్లు రాలగొడతాను" కాస్త కటువుగానే చెప్పాడు మూర్తి.

పరమాత్మ జవాబు చెప్పబోయేసరికి మళ్లీ తనే అన్నాడు బుజ్జగిస్తున్నట్టుగా.

"అది కాదురా! ఇప్పటికే ఫస్టియర్‌లో మూడు, సెకండియర్‌లో రెండు సబ్జెక్టులు ఉంచేశావు. అన్నీ పూర్తి చేయగలిగితేనే డిగ్రీ చేతికొచ్చేది. మా అందరి కంటే తెలివైన వాడివి. ఎందుకు ఇలా వృథాగా కాలక్షేపం చేస్తావ్!"

❀❀❀

"ఏం మాట్లాడవేరా?"

"నేను ఆలోచిస్తున్నది పరీక్షల గురించి కాదు."

"మరి?!"

"ఇందాక ట్రంకు రోడ్డులో జరిగిన సంఘటన గురించి..."

"దారినపోయే దానయ్యల గొడవ దేనికి మనకి?" అంటూ పుస్తకంలో లీనమయ్యాడు మూర్తి.

పరమాత్మ ఆలోచనల్లోకి జారుకున్నాడు. పది నిముషాల క్రితం సంఘటన అతని కళ్లముందు కదలాడింది.

అపుడే ఫస్ట్ షో వదిలారు. గుంపులు గుంపులుగా జనం బయటకు వస్తున్నారు. ఓ మూలగా నిలబడి వున్నారు మూర్తి, పరమాత్మ ఇద్దరూ.

థియేటర్ ఎదురుగా కేంటీన్‌లో టీ అంటే వాళ్లకి ప్రాణం. ఓ కప్పు టీ తాగి, రెండు దమ్ములు సిగరెట్ పీల్చేసి రూంకెడితే ఐదారు గంటలు లేవకుండా చదువుకోవచ్చు. అది మూర్తి ప్లాన్. సిలబస్ ఎలా పూర్తిచేయాలా అని అతను ఆలోచిస్తున్న సమయంలో-

"ఒరే! అటు చూడు!" అంటూ అడ్డుపడ్డాడు పరమాత్మ.

ఆమెకి పాతికేళ్లుంటాయి. అందంగా అలంకరించుకుంది. ఖరీదైన దుస్తులు, మోతాదు మించిన మేకప్‌తో చూపరులను ఆకట్టుకుంటోంది. ఒకసారి చూస్తే తల తిప్పుకోనివ్వని సౌందర్యం ఆమెది అని ఒక్క ముక్కలో చెప్పొచ్చేమో!

పరమాత్మ చెప్పిన వైపు దృష్టి సారించిన మూర్తి కూడా ఆ మాట బయటకు అనకుండా ఉండలేక పోయాడు.

"నేను చెబుతున్నది ఆమె అందం గురించి కాదు. ఆమె ప్రవర్తన గురించి"- అన్నాడు పరమాత్మ.

అర్థం కానట్టు మొహం పెట్టాడు మూర్తి.

"నేను ఇక్కడికి వచ్చినప్పట్నుంచీ గమనిస్తున్నాను. ఆ మూల నిలబడిన వ్యక్తి ఆమెను చూసి నవ్వుతాడు. ఏవేవో సైగలు చేస్తాడు. బదులుగా ఆమె నవ్వుతుంది. రెండోకంటి వాడికి తెలియకుండా కళ్లతోనే జవాబు చెబుతుంది. అతను వెర్రెత్తిపోతున్నాడు. ఆమె రెచ్చగొడుతూనే ఉంది."

"వాళ్ల పాట్లేవో వాళ్లు పడతారు. మధ్యలో మనకి దేనికి? నచ్చితే మనమూ ఓ ఐదు నిముషాలు ఆమె వంక చూసిపోతే సరి"- తేలిగ్గా అనేశాడు మూర్తి.

"అది కాదురా! ఆమెకి పెళ్లయింది. భర్తతో కలసి సినిమాకొచ్చింది. మొగుడు టిక్కెట్ తేవటానికి అటు వెళ్లగానే... ఇంతలోనే పరాయి మగాడితో ఇలా..."

ఆవేశంగా చెబుతున్న పరమాత్మ వంక అదోలా చూసి- "వాళ్లిద్దరికీ లేని బాధ మనకి



దేనికి? పరీక్షలు దగ్గరపడుతున్నాయి. పద పద"– అంటూ బలవంతంగా రూమ్‌కి లాక్కొచ్చాడు మూర్తి.

అతని ప్రయత్నాలు ఫలించలేదు. రూంకొచ్చే వరకూ పరమాత్మ లెక్చరిస్తూనే ఉన్నాడు. ఆ తర్వాత కూడా అతని ఆలోచనలు ఈ సంఘటన చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి.

మగవాళ్లు వెంటపడ్డారని, వెకిలి కామెంట్లు చేశారని నిందించే ఆడవాళ్లు దీనికి ఏం సమాధానం చెబుతారో?

సినిమాకని వచ్చి ఆమె పనేదో ఆమె చేసుకోక మధ్యలో అవతల మగవాడిని రెచ్చగొట్టడం దేనికి? కొంచెం స్పీడుగా ఉన్న వ్యక్తయితే ఒక అడుగు ముందుకేస్తాడు. సినిమాహాల్లో వెనక సీట్లోకి చేరటమో, పక్కన కూర్చోటానికి ప్రయత్నించటమో, ఇంకోటో... ఇంకోటో... చేస్తాడు.

ఆమె ఇల్లు కనిపెట్టి, తగిన అవకాశం కోసం ఎదురుచూస్తాడు. ఈ విషయం భర్తకి తెలిస్తే నానా రభస అవుతుంది.

ఇంతకీ థియేటర్ దగ్గర వ్యక్తి ఆమెను అనుసరించాడా? ఆ వ్యవహారానికి అక్కడే ఫుల్‌స్టాప్ పెట్టేసి ఆమె భర్తతో కలసి లోపలికి వెళ్లిపోయిందా?–

పరమాత్మ ఆలోచనలు వేగంగా సాగుతున్నాయి.

పెళ్లి అనే వ్యవస్థలో పవిత్రత అంతా స్త్రీలోనే ఎక్కువ కనిపిస్తుందని చెబుతారే! మగవాడికి ప్రేమ వేరు, పెళ్లి వేరూనట. పెళ్లయిన పరస్త్రీతో సంబంధం పెట్టుకోటానికి ఏమాత్రం వెరవడని, తను వేరే అమ్మాయితో గడిపినా అది కేవలం శరీర వాంఛ తీర్చుకోటానికేనని... ప్రేమించేది మాత్రం భార్యనేనని అంటాడట.

మగవాళ్లని ఇంత దుర్మార్గులుగా చిత్రించే వాళ్లకి ఇలాంటి ఆడవాళ్లు కనపడరా?

ఇది వ్యభిచారం కిందకు రాదా?

అక్రమ సంబంధం పెట్టుకుంటేనే వ్యభిచారమా? ఇలాంటి ఆడవాళ్లని ఉరితీస్తే తప్ప సంఘం బాగుపడదేమో! ఏం చేయాలి? అంతులేని సందేహాలు మనసును చుట్టుముట్టి గందరగోళ పరుస్తున్నాయి.

మూర్తిని మాట్లాడించాలనిపించింది. టేబుల్ లైటు వెలుతురులో తీక్షణంగా చదువుతున్నాడు. అతన్ని కదపాలంటే, అసలే చివాట్లు తిని ఉన్నాడేమో భయం వేసింది. ఆ ఆలోచన మానుకుని పుస్తకం తీశాడు. ఒక్క అక్షరం ముందుకు సాగలేదు. ఇక లాభం లేదనుకుని–

మంచం మీదకు చేరి నిండా ముసుగు కప్పుకున్నాడు. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. తెల్లవార్లూ మూర్తి పుస్తకాలతో కుస్తీ పట్టిన విషయాన్ని అతను పట్టించుకోలేదు.

❀❀❀

అప్పటికి పరీక్ష ప్రారంభమై అర్ధగంట కావస్తోంది. అంతా సీరియస్‌గా రాస్తున్నారు. తాము చదివిన ప్రశ్నలు వస్తాయో, రావోనని ఆదుర్దా పడినవాళ్లు, ముక్కున పట్టుకొచ్చిన నాలుగు ముక్కలు పేపరు మీద కక్కేయాలని ఆత్రుత పడుతున్నవాళ్లు–

పరీక్ష ఎలాగోలా గట్టెక్కడానికి ముందు వాడో, వెనక వాడో– ఈ రెండూ సాధ్యం కాకపోతే, బాత్రూంలో రహస్యంగా దాచిన స్లిప్‌లు సాయపడకపోతాయా అని ఆశపడుతున్న వాళ్లు–

ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువుతూ– ఏడాది శ్రమకు ఫలితం పొందే ఘడియలు సమీపించాయన్న ఆనందంతో గుండె బరువు దించుకోటానికి సిద్ధమైన వాళ్లు–

అంతా పరీక్ష పేపర్లలోకి తలదూర్చారు. మూర్తికి మరీ ఉత్సాహంగా ఉంది. రాత్రంతా కష్టపడి చదివిన ఇంపార్టెంట్ ప్రశ్నలన్నీ వచ్చేశాయి. ఈ ఒక్క సబ్జెక్టు కష్టం అనుకున్నాడు. ఇక ఫరవాలేదు. దాదాపు ఫస్ట్ క్లాస్ ఖాయమైనట్టే. సంబరంగా ఉందతనికి.

అదే గదిలో వెనక నుంచి మూడో బెంచీలో కూర్చున్నాడు పరమాత్మ. అతను రాయటం లేదు. కనీసం ప్రశ్నపత్రం వంకయినా చూడలేదు. ఇన్విజిలేటర్ ఆశ్చర్యంతో అతన్ని సమీపించి 'ఏనీ ప్రాబ్లమ్' అనడిగాడు. అదేం లేదని సమాధానం రావటంతో వెనక్కి తిరిగొచ్చి తన సీట్లో కూలబడ్డాడు.

పరమాత్మ చూపులు అతని ఎడమ వైపునున్న అమ్మాయి పైకి మళ్లాయి.

ఆమె శరీరం వంపులు, నడుము ముడత అతనికి స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎండాకాలం కావటం వల్ల శరీరమంతా దట్టంగా చెమట అల్లుకుని ఉంది. మెరుస్తున్న తెల్లటి శరీరం...

"మొన్న రాత్రి ఆమెతో సెకండ్ షోకెళ్లానురా! ఎంత ఎంజాయ్ చేశానని– ఆ తర్వాత మా రూంకెళ్లాం... తెల్లవారే వరకూ..."

ఓ స్నేహితుడు కేంటీన్‌లో ఆమె గురించి చెప్పినపుడు పరమాత్మకి అసహ్యం వేసింది. ఆమె రోజుకో వ్యక్తి బైక్‌పైన రావటం, అందరితోనూ విచ్చలవిడిగా కబుర్లు చెప్పటం, సినిమాలు, షికార్లు... వంటి వాటివల్ల స్టూడెంట్స్‌కి ఆమె ఓ టాపిక్ అయ్యేది.

తను అంత పట్టించుకునే వాడు కాదు. హఠాత్తుగా వారం రోజులపాటు ఆమె కాలేజీకి రాకపోవటం, దాని వెనుక 'అబార్షన్' అనే కారణం ఉన్నట్టు కాలేజీ గోడలు కోడై కూసిన సమయంలో–

ఆమె హఠాత్తుగా కాలేజీలోనే చదువుతున్న వ్యక్తినే వివాహమాడిన వార్త వెలువడింది.

ఆమె ప్రవర్తన గురించి బాహాటంగా విమర్శలొచ్చినా, అదే కాలేజీలో వ్యక్తి ఆమెను ఎలా వివాహమాడాడో పరమాత్మకి అర్థం కాలేదు.

ఆమె అందం చూశాడని, లక్షలకొద్దీ కట్నంతో ఆమె వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దాడని చెప్పుకున్నారు.

"వాళ్లిద్దరి వైవాహిక జీవితం ఒకర్నొకరు మోసం చేసుకోవటం కాదూ!"

చాలాసార్లు తర్కించుకున్నాడతను. సరైన సమాధానం అందక మధనపడ్డాడు. రెండు నెలల తర్వాత– ఇప్పుడు పరీక్ష హాల్లో ఆమె కంటపడింది. ఆమెను పలకరించి మాటల్లో పెడితే సమాధానం ఏమైనా దొరుకుతుందేమో! ప్రయత్నించాలని అతను అనుకుంటుండగా–

టైమ్ అయ్యిందని సూచిస్తూ కాలేజీ బెల్ గణగణమని మోగింది.

అతను తల ఎత్తి చూసేసరికి ఆమె కనిపించలేదు. వడివడిగా బయటికొచ్చాడు. అప్పటికే ఆమె కాలేజీ గేటు దాటుతోంది. ఒక్కసారిగా నిరాశ ఆవరించింది. దీర్ఘంగా నిట్టూర్చి మూర్తి రాక కోసం ఎదురు చూడసాగాడు.

❀❀❀

"ఈ సంఘాన్ని బాగుచెయ్యటానికి నువ్వేమైనా వీరేశలింగం అనుకుంటున్నావా? రాజా

రామ్మోహన్‌రాయ్ అనుకుంటున్నావా? ఎవరెటుపోతే నీకేం!"

✿✿✿

"నిన్ను నువ్వు సంస్కరించుకోలేనివాడివి, సంఘాన్నేం ఉద్ధరిస్తావు. కాలేజీలో చదువుతున్న వాడివి, నీకు చదువు, పుస్తకాలు ముఖ్యం కానీ, వాటికి అటకెక్కించేసి సమాజం, నైతిక విలువల గోల దేనికి?"

"పరుషంగా అన్నానని నువ్వు బాధపడినా సరే- నేను చెప్పదలుచుకున్న నాలుగు ముక్కలు చెప్పి తీరతాను"-

మూర్తి గంభీరంగా చెప్పుకుపోతుంటే వినటం పరమాత్మ వంతయ్యింది.

"నీకు చదువంటే బద్ధకం. భవిష్యత్తు అంటే భయం. రేపటి గురించి ఆలోచిస్తే ఎక్కడ ఆందోళన చెందవలసి వస్తుందోనని- లేనిపోని విషయాలపైన చర్చ లేవదీస్తావ్! తెలివిగా వాదనలు చేస్తావ్!"

"ఈ రకంగా చుట్టుపక్కల వాళ్లని ఆకట్టుకునే ప్రయత్నం చేయటం నీకు అలవాటు. ఆ ఆనందంలో నీ బాధ్యతలను పక్కన పెడతావు."

"నువ్వేమనుకున్నా సరే- ఈ భూమండలం మీద నీ అంత ఫూల్ ఇంకొకడు ఉండడు."

ఏ విషయంపై అయినా అనర్గళంగా వాదించే పరమాత్మ మొట్టమొదటిసారిగా స్నేహితుడి ముందు తలవంచుకుని నిలబడ్డాడు. అతను చెప్పే మాటల్ని తరచి తరచి వింటున్నాడు.

"చాలా రోజుల క్రితం మనం థియేటర్ దగ్గరికెళ్లినప్పటి సంఘటన జ్ఞాపకం ఉందా?"

"ఓ వివాహిత అపరిచితుడ్ని చూసి నవ్విందని నువ్వు గగ్గోలు పెట్టావు. అతను ఆమె చిన్నప్పటి స్నేహితుడో, బంధువో ఎందుకు కాకూడదు?"

"ఆమె నవ్వులో నువ్వెందుకు 'నెగెటివిటీ'ని చూడవలసి వచ్చింది?"

"వాళ్లంతా చెడిపోయారని గోల చేస్తున్నావు గానీ, నిజానికి చెడిపోయింది నువ్వే!"

"ఎప్పుడో ఓసారి వాళ్లు అడ్డదోవ తొక్కుంటారు. పొద్దస్తమానం సంబంధం లేని ఆడవాళ్ల గురించి ఆలోచిస్తూ నీ మెదడు కుళ్లిపోయింది. ఆలోచనలు కలుషితమయ్యాయి. నీకంటే చెడిపోయిన వాళ్లు ఉంటారంటావా?"-

సూటిగా చెప్పేసి గబగబా బయటకు నడిచాడు మూర్తి.

ఆ గదిలో ఒంటరిగా మిగిలిపోయాడు పరమాత్మ.

✿✿✿

రిజల్ట్స్ పేపర్ చేతిలో పెట్టుకుని వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించాడు. స్నేహితుని మాటలు అతని చెవిలో మార్మోగుతున్నాయి.

○

# దబాయింపు సెక్షను

**ఆం**ధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం గారికి ప్లీడర్‌గా గొప్ప పేరు వుండేది. వాదించడానికి ఏ సెక్షనూ దొరకనప్పుడు దబాయింపు సెక్షనుతో వాదించి నెగ్గుకు రావడం ఆయన పద్ధతి.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆయన నడిపిన ప్రజాపత్రిక తరచుగా ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటూ వుండేది. ఒక పెద్ద మనిషికి యివ్వాల్సిన బాకీ పెరిగిపోయింది. ఆంధ్ర కేసరిని ఎదురుపడి అడిగే ధైర్యంలేదు. అందుకనీ ఆ బాకీదారుడు తన డబ్బు కష్టాలన్నిటినీ ఏకరవుపెడుతూ పెద్ద ఉత్తరం రాసి, తన గుమస్తాతో పంపాడు. ప్రకాశం గారు ఆ 'పుస్తకాన్ని' ఓ వైపు చదివేసి, చిరాగ్గా తీసి చెత్తబుట్టలో పడేశారు. "రెండోవైపు కూడా రాశారండీ. అది కూడా..." అని భయంగా గొణిగాడు గుమస్తా. "తెలుసులేరా. పత్రికలకి రాసేటప్పుడు కాగితానికి ఒకవైపునే రాయాలని తెలియదా మీ యజమానికి. అది చాలా తప్పు అని చెప్పు" అని గసిరి పంపేశారు ప్రకాశంగారు.

-శ్రీరమణ